# అంశుమాలి

కుసుమారెడ్డి

ఆకాశం మబ్బులతో, నల్లని దుప్పటిని కప్పుకొన్నట్టుంది. మూడు ముళ్ళూ వేసిన మూణ్ణాళ్ళకే భార్యని హింసిస్తున్న వరుడిలా, వరుణుడు భూమ్యాకాశాలను ఏకం చేసి బీభత్సం సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాడు.

తలుపులు టపటపమని చప్పుడు కావడంతో మంచం మీద తన్మయత్వంతో అభిమాన రచయిత 'అంశుమాలి' నవల చదవడంలో మునిగిపోయిన మధురిమ, తన దీక్ష కంతరాయం కలిగించిన తలుపు వంక అసహనంగా చూసింది.

మళ్ళీ తలుపు చప్పుడవుతూనే ఉంది.
ఆమెకు విసుగు, ఆ వెనుక భయం కలిగాయి.

కాని అంతలోనే 'అంశుమాలి' నవల్లో హీరోయిన్ చూపిన ధైర్యసాహసాలు మదిలో స్ఫురించడంతో, ధైర్యంగా ఒక్కో అడుగు కూడదీసుకుని, వెళ్ళి కిటికీ తలుపులుతీసి చూసింది.

అంతే ! ఫెడీలుమని కొట్టినట్టు ఆమె చెంపలను తాకిన జల్లుకు పులకరించి, చిన్నగా నవ్వుకొంటూ కిటికీ మూసేసింది.
బహుశ : 'అంశుమాలి' నవల్లో హీరోయిన్ అలా చేసి ఉండవచ్చు.

తన అభిమాన రచయిత శైలీ మాధుర్యం ఆమె మనసును పరవశింపచేస్తోంది. ముఖ్యంగా ప్రేమసన్నివేశాల్లో నాయికా నాయకుల చేత పలికించిన సంభాషణలు, వారి చేష్టలు మనసును మత్తెక్కిస్తున్నాయి.

రాత్రి సగ భాగం దాటిపోయినా కూతురి గదిలో లైట్ వెలుగుతూండటం చూసి తల్లి తండ్రీ ఆశ్చర్యపడలేదు కానీ, ఆమె ప్రవర్తన, మాటలు వారికి భయాందోళనలను కలిగిస్తున్నాయి.

మధురిమ తండ్రి సూర్యదేవ్... తల్లి ప్రభావతి, నలుగురు ఆడపిల్లల తర్వాత ఆఖరిది మధురిమ.

ఉద్యోగం ఉండగా ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లూ ఘనంగానే చేశాడు. పదవీ విరమణ కాక మిగతా ఇద్దరికీ అతికష్టం మీద అప్పు చేసి పెళ్లిళ్లు చెయ్యగలిగాడు. ఇక గారాల కూతురు మధురిమ మిగిలింది.

చిన్నప్పటి నుంచి అనుకోకపోయినా సూర్యదేవ్ ఆర్థిక పరిస్థితులకు జాలిపడి మధురిమను తన కోడలుగా చేసుకుంటానని, ఇంకో ఏడాదిలో కొడుకు చదువు పూర్తయ్యాక పెళ్లి జరిపిస్తానని - చెల్లెలు మాట ఇవ్వడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకోగలిగాడు సూర్యదేవ్.

మధురిమ హైస్కూల్ చదువు ముగిశాక

**'ఇతనా తను అభిమానించిన రచయిత! ఎంత పొరబాటు జరిగింది' - మధురిమ తీయని ఊహలు. ఆలోచనలూ ఎందుకిలా పటాపంచ లయ్యాయి?**



కాలేజీలో చదివించే స్తోమత లేక ఏమీ తోచడం లేదని కూతురు మారాం చేయడంతో రోజూ తనతో పాటే లైబ్రరీకి తీసుకెళ్లేవాడు సూర్యదేవ్.

సాహిత్యంలో మైలురాళ్ళ లాంటి మహనీయుల రచనలు చదవమని తండ్రి పోరుతుంటే ఆమెకు హాట్‌కేక్స్ లాంటి ఇప్పటి నవలలు తప్ప, పాతవి నచ్చేవి కావు.

సూర్యదేవ్ ఈనాటి ఆడపిల్లల మానసిక స్థితిగమనించి ఆమె ఇష్టానికి అడ్డు చెప్పలేదు. కానీ భార్యకు రవ్వంత సాయం కూడా చేయకుండా నిద్రాహారాలు లేకుండా నవలలు చదివే కూతుర్ని అప్పుడప్పుడు మందలించేవాడు. భార్య అనారోగ్యం మనిషి, కాలక్షేపానికి చదివే పుస్తకాలు మాదక ద్రవ్యాల వంటివని తెలిస్తే బ్రతిమాలో, బామాలో చెల్లెలిని ఒప్పించి మేనల్లుడితో వివాహం జరిపించేవాడు. కానీ మనిషికన్నా వేగంగా మనసు పరిగెడుతుందని ఊహించలేకపోయాడు సూర్యదేవ్.

ఫలితంగాఅభిమాన రచయితనే పెళ్ళి చేసుకుంటానని కూతురు పట్టుబట్టడంతో సూర్యదేవ్ హృదయంలో కత్తులు దింపినట్లయింది.

తెల్లారింది. రాత్రి కురిసిన వానకు పుడమి తల్లి తడి తడిగా ఉంది. గాలి దుమారానికి చెట్ల ఆకులు, కొమ్మలు పోట్లాడుకున్నట్టుగా చిందరవందరగా పడి ఉన్నాయి.

పుల్లలు తడిసి, పొయ్యి రాజుకోక నానా అవస్థ పడుతోంది ప్రభావతి. వానకు దొడ్లో పెట్టిన పాదులు అస్తవ్యస్తంగా పడి ఉండటంతో పడిపోయిన మొక్కల్ని నిలబెడుతున్నాడు సూర్యదేవ్.


ఇందరు ఇన్ని రీతుల్లో బాధపడుతున్నా మధురిమ ఇవేం పట్టించుకోవడం లేదు. ఆమె ఆలోచనలు అభిమానరచయిత చుట్టూతిరుగుతున్నాయి.

క్షణాలు యుగాలుగా.. నిముషాలు గంటలుగా దొర్లుతున్నాయి తిలక్ కవితలోలా-


ఆమె చూపులు గజ్జెల వలె ఘలంఘలిస్తున్నాయి.

ఆమె అణువణువూ పులకింతతో పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూస్తోంది.

కాసేపటికి పోస్ట్‌మాన్ రావడం, ఆమె కలల పంట ఆమె చేతిలో పడటం జరిగాయి.



కవరు చించుతున్న మధురిమ కళ్ళల్లో కోటి పున్నములు. అరవిచ్చిన ఆమెకళ్లు 'అంశుమాలి' రాసిన రెండు వాక్యాల ఉత్తరానికే సంతోషం పట్టలేక - మత్తుగా, మౌనంగా తుమ్మెద రెక్కల్లా క్షణం సేపు మూసుకున్నాయి.




ఆ కళ్లలో వెలుగుని, తమకన్న . ఒక జత ముళ్లలాంటి కళ్లు చూస్తున్నాయని ఆమె గుర్తించి ఉంటే ఆ ఉత్తరం చదవకపోను. ఆమె చెంపలు వగలకపోను !

ఆమె కళ్ళువిప్పేసరికి రౌద్రమైన కళ్లతోసూర్యదేవ్ కనిపించడంతో ఆమె శరీరం క్షణం సేపు గజగజ వణికింది. కెంపు వర్ణం దాల్చిన సోగకళ్లని కోపంతో పైకెగరేసింది.

ఆ చూపులో 'ఏం చేస్తే అది చేసుకోండి' అనే ధిక్కారం ఉంది. తన రచనలతో తన లాంటి వాళ్ల గుండెల్ని దోచుకొని సయ్యాటలాడుతున్న అందగాడైన 'అంశుమాలి' ఫోటో ఆమె చేతిలో ఉంది.

కనిపెంచిన కన్నబిడ్డని ఎవరో అనామకుడు అవలీలగా దోచేసుకుంటున్నాడు అనే ఆవేదన సూర్యదేవ్ కళ్లలో తొంగి చూస్తోంది.

ఉత్తరాన్ని జాకెట్టులో దాచుకొని ఆమె గదిలోకి పరిగెత్తి తలుపేసుకొంది.'అంశుమాలి' ఫోటోని ఆప్యాయంగా గుండెలకు అదుముకొంది.

ఆ ఫోటో ఆమెచేతుల్లోఎంత సేపు నలిగిందో ఏమో కాని, సాలీళ్లలా చుట్టుకొన్న ఆలోచనలతో ఒక నిర్ణయానికి రాలేక ఆమె మనసు మాత్రం నలుగుతూనే ఉంది.

రెండు మూడు రోజుల తర్వాత-

ఆ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది.

కొద్ది రోజులలో పెళ్లి కావాల్సిన పిల్ల గడప దాటిందన్న సంగతి లోకానికి తెలిస్తే ఎలాంటి నిందలు భరించాల్సి వస్తుందోనని, తుపానులో చిక్కుకున్న నావికుల్లా వాళ్ల గుండెలు విలవిల్లాడాయి.

దేశానికి నిజంగా స్వతంత్రం వచ్చిందన్నట్టుగానే. అర్థరాత్రి ఇల్లు దాటింది మధురిమ. మర్నాడు ఉదయం తన అభిమాన రచయిత ఇంటి ముందు ఆటో దిగి లోపలికెళ్లింది.

ఇల్లు పాతది అయినా రచయిత అభిరుచికి దర్పణంలా అందంగా తీర్చి దిద్దినట్టుంది.

ఆడబోయిన తీర్థం ఎదురైనట్టు- రచయిత వళ్లోనే ఎదురవ్వడంతో మధురిమ మనసు సరిగమలు పాడేసింది. అతని పలకరింపుతో మనసులో పన్నీరు కురిసింది. ఫోటో కన్నా రెట్టింపు అందంతో ఉన్న 'అంశుమాలి'ని చూసే సరికి ఆమె మూగ కలలు కంచెలు దాటేశాయి.

"కూర్చోండి. అంశుమాలి గారి కోసం వచ్చారా? పిలుస్తాను"

అతని మాటలకు పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడింది మధురిమ.

ఏమిటీ అతను అంటున్నది అంశుమాలిగార్ని పిలుస్తానంటాడేమిటీ? కొంపతీసి కవలలు కాదు కదా? ఆమె ఆలోచనలు చిక్కుబడిన దారపు ఉండల్లా చెల్లాచెదురుగా ఉన్నాయి.

కొద్దిసేపటికి యాభై ఏళ్ళ వయసున్న వ్యక్తి పంచె, లాల్చీ వేసుకొచ్చేసరికి మధురిమ గుండె అకస్మాత్తుగా ఆగినంత పనైంది. ఒళ్లంతా స్వేద బిందువులు అలుముకున్నాయి.

"మీ ఉత్తరాలు అందాయి. నా నవల నచ్చినందుకు ధన్యవాదాలు"

ఇతను తన అభిమాన రచయితా? మైగాడ్. ఎంత పొరపాటు జరిగింది. అందమైన బావని పురుగులా చూసి పొరలు కమ్మిన కళ్ళతో ఎన్ని ఊహలు అల్లుకొంది ! ఎంత మోసం, ఎంత దగా.. ఫోటోలో సుందరాంగుడికీ, ఈ ముసలి నక్కకీ ఎంత తేడా? పంచదార అద్దినట్టు ఉత్తరాలు ఎంత తియ్యగా రాశాడు.

ఎరుపెక్కిన వదనంతో సుడిగాలిలా వెనుదిరిగిన మధురిమను చూస్తూ'అంశుమాలి' అన్నాడు. "చూశారా నాన్నా ! అభిమానమన్నది ఎంత క్షణికమైనదో ! నా అందాన్ని ప్రేమించింది కాని.. నా లోని రచయితను కాదు. ఏడాది పరిచయంలో కొన్ని వందల ఉత్తరాలు రాసి నేను రెండు ఉత్తరాలు వ్రాయగానే పరిగెత్తుకొచ్చిన ఆమె బలహీనతను తెలుసుకోవాలనే మీ చిన్ననాటి ఫోటో ద్వారా రచయిత మీరేనని చిన్న డ్రామా ఆడాను. గెలిచాను" !

'అంశుమాలి' మాటలు మధురిమ వింటే ఏం చేసేదో తెలియదు కానీ.. అతడిని తండ్రి చూపులు అభినందించాయి. *